## పేదల సొంతింటి కల నెరవేర్చడమే
# ప్రభుత్వ లక్ష్యం



ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు అందజేస్తున్న స్పీకర్, కలెక్టర్ తదితరులు

వికారాబాద్, జూన్ 19: పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ పట్టణం, మండలానికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. వికారాబాద్ పట్టణానికి చెందిన 359 మంది, వికారాబాద్ మండలానికి చెందిన 254 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సభాపతి ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మొత్తం నాలుగు విడతల్లో లబ్దిదారుల బ్యాంకు ఖాతాలోనే డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. బేస్‌మెంట్ గానీ గోడలు గానీ స్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో పడుతాయన్నారు. స్పీకర్ హోదాలో ఉండడంతో వికారాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా 7000 ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని , మన నియోజకవర్గంలో స్వంత ఇల్లు లేని పేదలందరికి ఏడాదికి కొంతమందికి చొప్పున అందరికి ఇండ్లను మంజూరు చేయిస్తామని ఆయన వివరించారు. వికారాబాద్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉన్న భూములలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు అందుతాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.అనంతగిరిని పర్యాటకంగా వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నదని, ఈ ప్రాజెక్టుతో యువతకు కూడా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనునట్లు ఆయన పేర్కొన్నారు.ముందుగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ మహిళా శక్తి మన దుకాణం స్టాల్ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో కలిసి సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, డీఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, డీసీసీబి డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టీఏ సభ్యులు జాఫర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

వికారాబాద్, జూన్ 19: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్, వివిధ శాఖల ద్వారా ఎస్సీ వర్గాలకు వెచ్చిస్తున్న నిధులపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీల సమస్యల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన వాటాలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన ఎస్సీ ఎస్టీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి జూలై మాసం నుంచి కార్యాచరణ రూపొందించుకొని ప్రతి నెల చివరి శనివారం పౌర హక్కుల దినాన్ని నిర్వహించి తహసీల్దార్, పోలీస్ అధికారి తప్పని సరిగా హాజరు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కు సూచించారు. జిల్లాలోని సమస్యలను తెలుసుకునేందుకు వీలుగా మూడు మాసాలకు ఒకసారి డివిఎంసి సమావేశాలు నిర్వహించి సంబంధిత శాఖల అధికారులు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. మూఢనమ్మకాలు,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన చట్టాలపై అదేవిధంగా చట్టాలు అందరికీ సమానమనే విషయాన్ని అందరిలో అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇల్లు , రాజీవ్ యువ వికాస్ లలో కూడా వాటాలకు అనుగుణంగా ఎస్సీ ఎస్టీలకు అవకాశాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పదోన్నతుల్లో ఎస్సీ ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య , సభ్యులు లక్ష్మీనారాయణ, శంకర్, రాంబాబు నాయక్ లకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మెమొంటోలు అందజేసి సత్కరించారు.ముందుగా రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కొత్తగడి రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, ఏవైనా సస్యాలున్నాయా అని ఆయన ఆరా తీశారు. వంట గది, స్టోర్ రూమ్ ను పరిశీలించి భోజన సదుపాయాల పై ప్రిన్సిపాల్ సాయిలత, డీఎస్సీడీఓ కమలాకర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, ఎం.సుధీర్, డీవిఎంసి సభ్యులు పెండ్యాల అనంతయ్య, గోవింద్ నాయక్, దస్తప్ప, ఎస్. రాజలింగం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వికారాబాద్, జూన్ 19..వికారాబాద్ ఆలంపల్లి లో బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ నివా సానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్ సందర్శించి తేనీటి విందు స్వీకరించారు. శుభప్రద్ పటేల్ వారికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిరణ్‌పటేల్ , సురేశ్ గౌడ్, దేవదాస్ , కేదార్‌నాథ్, శాంతి కుమార్, రుకుం, సిద్ధికి పాల్గొన్నారు.

## డ్వాక్రా భవనం మంజూరు చేయాలి



కడా ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఈర్లపల్లి గ్రామస్తులు

బొంరాస్ పేట,జూన్ 19 : దుద్యాల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో డ్వాక్రా భవనం మంజూరు చేయాలని కడా ప్రత్యేక అధికారి వెంకటరెడ్డికి మహిళలు వినతి పత్రం అందించారు. ఈర్లపల్లి గ్రామంలో 26 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని అందులో 260 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని సమావేశం జరుపుకొనుటకు భవనం లేకపోవడంతో చెట్ల కింద ఎండ వానలకు కూర్చొని సమావేశాలు నిర్వహించుకుంటున్నామని దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు సమావేశం నిర్వహించుకునేందుకు ఒక డ్వాక్రా భవనమును మంజూరు చేయాలని మహిళలు కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షులు సరిత, కోశాధికారి విజయ్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రవి నాయక్, మొగులయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ



పరిగి, జూన్ 19: పరిగి మండలం గడిసింగాపూర్ గ్రామంలో 15 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందించారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను పంచాయతీ కార్యదర్శి మొగులయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు జి. వెంకట్ రాములు అందజేశారు. త్వరలో ఇండ్ల కు ముగ్గు పోసే కార్యక్రమం ఉంటుందన్నారు. లబ్ధిదారులు నాణ్యమైన ఇండ్లను నిర్మించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమం లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు మాణిక్యం, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్, నబి, రామ్ చరణ్, మొల్ల వెంకటయ్య, లబ్దిదారులు పాల్గొన్నారు.



బొంరాస్ పేట,జూన్ 19: జడ్పీ ఉన్నత పాఠశాల దుద్యాలలో పదో తరగతి చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు విద్యాధికారి విజయరామారావు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. చరణ్ అనే విద్యార్థికి సర్వ శిక్ష అభియాన్ ద్వారా ఐఈఆర్పీ రామ్,శ్రీనివాస్ ద్వారా ట్రై సైకిల్లు, రాధిక అనే పదవ తరగతి విద్యార్థికి ఈయరింగ్ మిషన్లను అందించారు.ఈ కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దోమ, జూన్ 19 : భూ సమస్యల పరిష్కారానికి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ గోవిందమ్మ అన్నారు. మండల పరిధిలోని అయినాపూర్ గుండాల గ్రామాల్లో గురువారం రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను తీసుకోన్నుట్లు ఆమె తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ సైన్ మిస్సింగ్ సర్వే నెంబర్, విరాసత్, ఆర్ఎస్ఆర్ తదితర సమస్యలపై రైతులు దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు కార్యక్రమంలో ఆర్ ఐ సుదర్శన్ రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు

### ఉపకరణాల కోసం
## దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి

వికారాబాద్, జూన్ 19: అర్హులైన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి బి. కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ద్వారా దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి పరికరాలు, లర్నింగ్ మెటీరియల్, ఎంఆర్సీ చప్పల్స్ ఉచితంగా పంపిణీ చేయనున్నారు. శారీరక దివ్యాంగులు, అంధులకు, బధిరులకు, మానసిక దివ్యాంగు లకు రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వెహికల్స్, బ్యాటరీ వీల్ చైర్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికల్స్, హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్మెంట్, వీల్ చైర్, ల్యాప్టాప్స్, ట్యాబ్స్, 4జీ స్మార్ట్‌ఫోన్స్, ట్రైసైకిల్స్, క్యాలిపెర్స్, ఆర్టిఫిషల్ లింబ్స్, క్రచెస్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ కేన్స్, బ్రెయిలీ బుక్స్, బ్రెయిలీ కిట్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్, ఎంఆర్సీ చప్పల్స్ ఉచితంగా పంపిణీ చేసేందుకు నిర్ణయించిందన్నారు. తేదీ. 18.06.2025 నుంచి 27.06-2025 వరకు ఆన్ లైన్ దరఖాస్తు గడువు పొడగించడం జరిగిందన్నారు. https://tgobmms.cgg.gov.in//వెబ్‌సైటులో అన్ని ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి నియమ నిబంధనల మేరకు అర్హత గల దివ్యాంగులను ఎంపిక చేస్తారన్నారు. అర్హతలు, నిబంధనల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమ శాఖాధికారి కార్యాలయాన్ని సంప్రదిం చాలని తెలిపారు.

## స్థానిక మిల్లులకే ధాన్యం పంపించాలి



అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో మాట్లాడుతున్న కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు

కులకచర్ల, జూన్ 19: కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్ పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సేకరించిన ధాన్యాన్ని సిద్దిపేటకు పంపియడంతో తొందరగా ఆన్‌లోడు కాకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ను కలిసి ధాన్యం కొనుగోలుపై సెంటర్ల పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చివరి దశలో ఉన్నందున మండలంలోని మిల్లర్స్‌కు పంపించాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యం ను మండలాల్లో ఉన్న మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు స్థానికంగానే ఉన్న మిల్లులకు ధాన్యాన్ని పంపించాలని అన్నారు. ఈ సందర్భంగా డీఎస్ఓ బాబు మోహన్, డీఎం మురళీకృష్ణను కలిశారు.

## పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్య వర్గం



కులకచర్ల, జూన్ 19: కులకచర్ల మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కడంపల్లి రాఘవేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎం శివ, కోశాధికారిగా శైలజారెడ్డి, సలహా దారులుగా భాస్కర్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, జహంగీర్, అర్షద్, జిల్లా కోఆర్డినేటర్ గా హరీశ్వర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా శంకర్‌రెడ్డి, మహిళా విభాగంలో నాయకులుగా మైమునా బేగం, ఎల్లమ్మ, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా దేవ్ సింగ్, అయూబ్ , విజయలక్ష్మి, కవిత, సోషల్ మీడియా కన్వీనర్ గా సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష్య కార్యదారులుగా ఎన్నికైన అశోక్ కుమార్, రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ఎంపీడీఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## నేడు భూభారతి రెవెన్యూ సదస్సు

బొంరాస్ పేట,జూన్ 19 : భూభారతి రెవెన్యూ సదస్సులలో భాగంగా నేడు చివరి రోజు ఏర్పుమల్ల గ్రామంలో సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు.శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భూభారతి రెవెన్యూ సదస్సు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిం చనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులో అధికారులకు దరఖాస్తులు అందించి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు.

## నేడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మర్పల్లి, జూన్ 19: మండల కేంద్రంలోని ఆకుల రాజేందర్ ఫంక్షన్ హాలులో నేడు (శుక్రవారం) కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్ కుమార్ రానున్నట్లు తహసీల్దార్ పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని లబ్ధిదారులు రావాలని ఆయన కోరారు

## మద్యపానం నిషేధంపై గ్రామస్తుల ర్యాలీ




కులకచర్ల, జూన్ 19: మండల పరిధిలోని బండ వెల్కిచర్ల గ్రామంలో మద్యపానం నిషేధం పై యువజన సంఘాలు, విద్యార్థులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి గ్రామంలో మద్యపాన నిషేధాన్ని విధించాలని గ్రామస్తుల ఆధ్వర్యంలో తీర్మానించేందుకు శుక్రవారం యువజన సంఘాల ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తామని యువకులు తెలిపారు. కార్యక్రమంలో చిన్న మల్లెల మల్లయ్య, మంత్రి వెంకటేశం, రాములు, మాల శ్రీనివాస్, అంజి, బుగ్గయ్య, బాలవర్ధన్, నవీన్, పాండు పాల్గొన్నారు.

## 58 ఎన్‌డీపీఎల్ బాటిళ్లు పట్టివేత

సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): డిఫెన్స్ క్యాంటిన్ లలో ఆర్మీ, ఎక్స్‌సర్వీస్‌మెన్‌లకు విక్రయించే మద్యం పక్కదారి పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల నుంచి మద్యం మాఫియాలు తక్కువ ధరకు మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి, మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న మల్కాజిగిరి, మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు ఉప్పల్, ఘట్‌కేసర్, మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 28డిఫెన్స్ మద్యం బాటిళ్లు, గోవా నుంచి తరలిస్తున్న 30నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు

### బడిబాట..
# ఆఖరి రోజు ఆటలపోటీలు



ధారూరు, జూన్ 19: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించాలని గడ్డమీది గంగారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు అన్నారు. గురువారం ధారూరు మండల పరిధిలోని గడ్డమీది గంగారం ప్రాథమికోన్నత పాఠశాల లో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.




కులకచర్ల, జూన్ 19: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కులకచర్ల తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి అన్నారు. గురువారం మండల పరిధిలోనీ చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఆయన బహుమతులు, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్ కుమార్, ఆర్ఐ ఖాజా, గ్రామస్తులు కోస్గి అమృతయ్యగౌడ్, కొండ నీలయ్య, కొండ అంజి, కొండ గోపాల్, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్స్ అనిత, సప్న, కమల, శ్రీనివాస్,సాయిలు, రికార్డు అసిస్టెంట్ లక్ష్మయ్య, విఆర్ ఏ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, దస్తయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



బొంరాస్ పేట, జూన్ 19 : దుద్యాల,బొంరాస్ పేట రెండు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట చివరిరోజు వేడుకలను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఏర్పుమల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, నాయకుల సమక్షంలో నిర్వహించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.అనంతరం విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, పాఠశాల హెచ్ఎం వెంకట్ రెడ్డి, గ్రామ పెద్దలు అంజిల్ రెడ్డి, అనంతయ్య,శ్రీనివాస్,చైర్మన్ వసంత, అంగన్వాడి సిబ్బంది సుజాత, గౌసియ బేగం తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కారు డోర్ తగిలి నిండు గర్భిణి మృతి

బండ్లగూడ, జూన్ 19: కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ నిండు గర్భిణి బలైంది. చెకప్ కోసం దవాఖానకు వెళ్లి తిరిగి భర్తతో కలిసి బైక్‌పై వస్తుండగా కారు డోర్ తగిలి కిందపడగా.. ఆమె పైనుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం. బాలాపూర్ మండలం, మల్లాపూర్‌కు చెందిన సయ్యద్ జమీర్ భార్య ఆశ్రమ ఫాతిమా 9 నెలల గర్భవతి. గురువారం బైక్‌పై ఆమెను పిల్లర్ నంబర్ 90 వద్ద ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. తిరిగి వస్తుండగా పిల్లర్ నంబర్ 190 వద్ద ఓ కారు డ్రైవర్ డోరు తీయగా.. బైక్ డోర్‌కు తగిలి కింద పడిపోయారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఆశ్రమ పైనుంచి పోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనతో అక్కడ భారీ స్థాయిలో ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. భర్త జమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

అర్జెంట్‌గా కావలెను

★ అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం కలదు @ కోహెడ ఫ్రూట్ మార్కెట్‌లో & షాద్‌నగర్ ప్రాంతాల్లో. సంప్ర: 9392663777, 9246663777.
NT-347056

డాక్యుమెంట్ పోయినది

★ జి.రాము, తండ్రి: జి.బాలయ్య, నివాసం: ఇం.నెం. 1-18, మాచన్‌పల్లి (గ్రా), షాబాద్ (మం), రంగారెడ్డి జిల్లా, తెలంగాణ అను నేను, 18/05/2025న మా ఇంటిని శుభ్రం చేస్తుండగా నా అసలు సేల్‌డీడ్ డాక్యుమెంట్ నెం. 1830/2022 పోయినది. ఎవరికైనా దొరికితే సంప్రదించండి: 9494930302.
NT-Vamshi

LOST

★ I, KELAVATH RAMESH, S/o. Kelavath Ramja, R/o. H.No. 8-49, Palgutta Tanah Kishanagar (V), Farooqnagar (M), RR Dist., T.S, have Lost My Original Sale Deed Doct. No. 1155/2024, while travelling from Shadnagar to Hyderabad. If any found, pls. Cont: 9701434971.
NT-344902

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962